క్లుప్తంగా

బాలబాలాజీ కల్యాణోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



కల్యాణోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ జరగనున్నాయి. కల్యాణోత్సవాల కరపత్రాలను, వాల్‌పోస్టర్లను పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు నగరంలోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామి వారి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, బత్తుల విజయ గంగారత్నం, వేద పండితులు జోస్యుల సోమయాజులు, మద్దాలి తిరుమల శింగరాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇనస్పెక్టర్ పసుపులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు శైవాగమ పాఠశాల ప్రారంభం

అంబాజీపేట: శ్రీ కంచి కామకోటి పీఠాధిపతుల వారి ఆధ్వర్యంలో ముక్కామలలో శైవాగమ పాఠశాలను ముక్కామల శివాలయం వద్ద శుక్రవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శైవాగమ పాఠశాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అంబాజీపేట అర్చక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఘనంగా గొల్లాలమ్మ తీర్థం

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో వేంచేసిన గొల్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారు గరగ రూపంలో ఇంటింటికీ వెళ్లగా మహిళలు నైవేద్యాలు, పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలను అందజేశారు. ఆలయ అర్చకులు చర్మ వాయిద్యాల దరువుకు అనుగుణంగా ప్రదర్శించిన గవ్వ నృత్యం భక్తులను గగుర్పాటుకు గురిచేసింది. వీధివీధినా భక్తులు కోడిపిల్లలను కానుకగా ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద నిర్వాహకులు పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

31 నుంచి వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయాల్లో వేంచేసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 31 నుంచి వచ్చే నెల 5 వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓలు ముదునూరి సత్యనారాయణరాజు, బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఎల్.గన్నవరం-1, 2 సచివాలయాల పరిధిలోని 33 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున బ్యాంకులో జమ చేసిన పత్రాలను, మెడల్స్‌ను గురువారం చిట్టిబాబు అందజేశారు. వలంటీర్లను దుశ్శాలువలతో సత్కరించారు. ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, పంచాయతీ కార్యదర్శి శరభరాజు, పార్టీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, యన్నాబత్తుల ఆనంద్, కొల్లు విజయ్, అన్నాబత్తుల చంటి, పందే సత్తిబాబు, లక్ష్మణరావు, పోతుమూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందీ అసిస్టెంట్లు, పండిట్లకు శిక్షణ

సఖినేటిపల్లి: విశాఖపట్నం కేంద్రంగా రాష్ట్రంలోని ఐదు జిల్లాలకు చెందిన 129 మంది హిందీ అసిస్టెంట్లకు, పండిట్లకు మండలానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు మహమ్మద్ తాహెర్ పాషా ఐదు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన శిక్షణ ముగింపు సభలో ఆ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన ఆయనకు సత్కారం చేశారు. వివరాలను ఆయన వాట్సాప్ ద్వారా తెలిపారు. అంతర్వేదిపాలెం మధ్యగ్రూపు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. 2018 డీఎస్సీలో ఎంపికై, 2020లో పోస్టింగ్ తీసుకుని హిందీ అసిస్టెంట్లుగా, పండిట్లుగా వారంతా పనిచేస్తున్నట్టు తాహెర్ పాషా అన్నారు. పిల్లలకు పాఠాలు సులభ రీతిలో అర్థమయ్యే రీతిలో మెళకువలు శిక్షణలో ఇచ్చినట్టు కూడా ఆయన చెప్పారు.

నిప్పుల కుంపటి



నిర్మానుష్యంగా కొత్తపేట మెయిన్‌రోడ్డు

- ఉష్ణతాపంతో ఉక్కిరిబిక్కిరి
- వడగాడ్పులతో ఇళ్లకే పరిమితమవుతున్న జనం

కొత్తపేట: వేసవిలో అందునా తీవ్ర ఉష్ణోగ్రతల వేళ ప్రయాణమంటే నాన్ ఏసీ ప్రయాణికులకు నరకమే. గత కొన్ని రోజులుగా భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం 10 గంటలు దాటితే సూర్య ప్రతాపం మొదలవుతోంది. 12 గంటలకు నడినెత్తిన ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ సమయంలో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. సాధారణంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అలాంటిది 45 డిగ్రీల వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడికి వడగాడ్పులు తోడవడంతో ఎక్కువగా ఉదయమే బయట పనులు చక్కబెట్టుకుని 11 గంటల్లోపే ఇంటికి చేరిపోతున్నారు. ఆ తరువాత నుంచి సాయంత్రం వరకూ ఇంటి వద్దే ఉంటూ ఏసీలు, కూలర్లు వేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో జనసంచారం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉద్యోగం, ఉపాధికి లేదా అత్యవసరంగా తలపెట్టిన పనికి ఎంత ఎండలోనైనా వెళ్లి రావాల్సిందే. ఇటువంటి పరిస్థితుల్లో సైకిలు, మోటార్‌సైకిల్, నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణికులు ఉష్ణతాపానికి గురవుతున్నారు.

వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతల వేళ ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు సాధ్యమైనంత వరకూ నీడలో వెళ్లాలి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తలకు రక్షణ కవచంగా టోపీ, తువాలు, కనీసం చేతి రుమాలు ధరించాలి. తరచూ మజ్జిగ, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్ తాగాలి. వడదెబ్బకు గురై ఏమైనా అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– కేఎస్‌ఎస్‌బీ హర్ష, వైద్యాధికారి, పీహెచ్‌సీ, వానపల్లి

మూగజీవాలకు రక్షణ కల్పించాలి



తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో మూగజీవాలైన కోళ్లు, గేదెలు, ఆవులకు సరైన వసతులు కల్పించాలి. మేతకు ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తరువాత బయటకు తీసుకువెళ్లాలి. షెడ్లను నీటితో తడిపితే కొంచెం చల్లగా ఉంటుంది. డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూడాలి. ఎండ తీవ్రంగా ఉన్నంతసేపు అవకాశం ఉంటే పశువులను చెరువుల్లో ఉంచాలి.

– సీహెచ్ వెంకటనారాయణ, ఏడీ, వెటర్నరీ, కొత్తపేట

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీ శంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత

అయినవిల్లి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతోందని అటవీశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించి భక్తులకు, ఆలయ అర్చక సిబ్బందికి, పాలక వర్గ సభ్యులకు అటవీశాఖ అధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు

ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



చింతలమోరిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని చింతలమోరి అశోక్‌నగర్‌లో గడప గడపకూ నిధులు రూ..10 లక్షలతోనూ పల్లిపాలెంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు చాలా దోహద పడిందన్నారు. ప్రజల ప్రధాన అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడమే ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమని ఆ దిశగా ముందుకు సాగడంలో పూర్తిగా విజయవంతమయిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు మరింతగా మెచ్చే విధంగా సీఎం జగన్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పథకాలు, విధానాలను ప్రజలలోనికి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోట రాజేష్, దొడ్డా బాబూరావు, బోణం వెంకట రామారావు, నల్లి వెంకటేశ్వరరావు, యెనుముల నారాయణస్వామి, కొల్లాబత్తుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ



చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండేటి

పి.గన్నవరం: అమరావతిలో ప్రభుత్వం మీకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చటానికి సరిపోతుందంటూ పేద వర్గాల ప్రజలను కించపరిచే విధంగా టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా శనివారం ఎల్.గన్నవరంలో జరిగిన ర్యాలీలో చిట్టిబాబు పాల్గొని మాట్లాడారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దీనిపై చంద్రబాబు అహంకార పూరిత వ్యాఖ్యలు చేశారని చిట్టిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, యన్నాబత్తుల ఆనంద్, పిల్లి నాగరాజు, డి.శ్రీనివాస్, కొప్పాడి నాగభూషణం, యన్నపు సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం అత్యంత వైభవంగా చండీహోమం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రతి నెలా అమావాస్య రోజున చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ వీర్రాజు తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే భక్తులు స్థానిక దేవదాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

స్థానిక పార్వతీ సమేత పృథ్వీశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని చక్రస్నానం జరిగింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వేద పండితులు అల్లంరాజు రామకృష్ణమూర్తి, జేఏ డి.భాస్కర శ్రీనివాసు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ప్రాంతాల్లో స్నానాలు చేయరాదు




బడుగువానిలంక గోదావరి తీర ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డు

ఆలమూరు: మండలంలోని గౌతమీ గోదావరి వెంబడి అనుమతి లేని రేవుల్లో, ఇసుక తిన్నెల్లో స్నానాలు చేయరాదని ఆలమూరు ఎస్సై ఎస్.శివ ప్రసాద్ కోరారు. బడుగువానిలంకలో సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి యు.సుప్రియతో కలసి ఆయన గోదావరి తీర ప్రాంతంలో పర్యటించారు. ప్రమాదకరమైన చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి గోదావరి తీర ప్రాంత ప్రమాదకర పరిస్థితులు వివరించాలని గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్లను ఆదేశించారు. ఈత సరదా కుటుంబాల్లో విషాదం కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల గ్రామాల పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

మండలంలోని బడుగువానిలంకలోని గోదావరి తీర ప్రాంతాల్లో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి తెలిపారు. గోదావరి తీరంలో ప్రమాదకరమైన ఊబిలో ఉన్నచోట సిబ్బందిని నియమించి స్నానాలకు వచ్చే పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్

రావులపాలెం: స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్‌లో వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సహకారంతో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు, సిబ్బందికి దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ చలివేంద్రాన్ని డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, వైఎస్సార్ యూనియన్ నాయకులు జీపీ రావు, నాగరాజు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: వేసవి తాపానికి చలివేంద్రాల ఏర్పాటుతో బాటసారులకు, వాహనదారులకు ఎంతో ఉపశమనం లభిస్తుందని పలువురు యువకులు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ వినాయక యాడ్స్ అధినేత బొక్కా వినాయకరావు ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఎదురుగా చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. పలువురు యువకులు మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు మజ్జిగ, డ్రింక్ చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిన ప్రభుత్వం

- పొడగట్లపల్లి, ఎల్.గన్నవరంలలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు



పొడగట్లపల్లిలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



ఎల్.గన్నవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

రావులపాలెం: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేకపోయిన సంక్షేమాభివృద్ధిని రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని ప్రభుత్వ, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో సచివాలయం-1 పరిధిలోని జనిపిరెడ్డిపాలెం, వెంకటాపురం, జిత్తుగపాడు, నవజీవన్‌నగర్ తదితర ప్రాంతాల్లో చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని కుటుంబ సభ్యులకు వివరించారు. ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేసి చూపించామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆదేశించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, వర్గ, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవడానికి ఏ ఇంటికి వెళ్లినా ప్రజల్లో సంతోషమే కనబడుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ గంధం దేవి, ఎంపీటీసీ కలిగినీడి సత్యవతి, పీఏసీఎస్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, జానకమ్మ సత్రం చైర్మన్ కొప్పిశెట్టి మల్లి, పార్టీ నాయకులు గంధం అన్నవరం, పమ్మి చంటి, సంపత్‌రావు, తోటకూర సత్యనారాయణ, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ పాలనకు ప్రజలు అండగా నిలవాలి

పి.గన్నవరం: అభివృద్ధితో పాటు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ఓటియాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఎల్.గన్నవరంలో జరిగింది. చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రజలు పొందుతున్న ఆర్థిక సహాయాన్ని గణాంకాలతో సహా ప్రజలకు వివరించారు. ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగకుండా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఏ కుటుంబాన్ని చూసినా నాలుగైదు సంక్షేమ పథకాలు అందుకున్న వారే కనిపిస్తున్నారని చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న జగన్‌కు ప్రజలు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, పార్టీ నేతలు మానుకొండ ప్రసాద్, గనిశెట్టి రామగణపతి, చొల్లంగి చిట్టిబాబు, సీహెచ్ వెంకన్న, పమ్మి అనిల్‌కుమార్, దొమ్మేటి దుర్గారావు, మంగం చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

మామిడికుదురు: ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని రాజోలు సీఐ ఎం.శేఖర్‌బాబు సూచించారు. నగరంలో శుక్రవారం నగరం ఎస్సై షేక్ జానీబాషా అధ్యక్షతన ఆటో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆటోల్లో నలుగురు ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకోవాలన్నారు. డ్రైవర్ పక్క సీటులో ఎవరినీ ఎక్కించుకోరాదన్నారు. మద్యం తాగి ఆటో నడపడం నేరమని హెచ్చరించారు. మద్యం తాగి ఆటో నడిపిన వారిపై మొదటి సారి ఫైన్ విధిస్తామన్నారు. రెండోసారి మద్యం తాగి వాహనం డ్రైవ్ చేస్తే వాహనం సీజ్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సును కూడా రద్దు చేస్తామన్నారు. ప్రయాణికులను ఇబ్బంది పెట్టే హిజ్రాలను ఉపేక్షించేది లేదన్నారు. దారి కాచి బలవంతంగా జేబుల్లో ఉన్న నగదు తీసుకోవడం నేరమన్నారు. అటువంటి వారిని కూడా విడిచి పెట్టేది లేదన్నారు. ఈ తరహా సమాచారం కూడా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆటో డ్రైవర్ల లైసెన్సులు, రికార్డులు పరిశీలించారు. ఆటో యూనియన్ ప్రతినిధుల సమస్య కూడా విన్నారు. రాజోలు ఎస్సై జి.పృథ్వీ, పలు ఆటో యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

అయినవిల్లి: మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిపై శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లిలంకకు చెందిన సకిలే చిన్న, జిత్తుక మహేష్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా వీరిని పట్టుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది జైలు

అంబాజీపేట: పాత కక్షల నేపథ్యంలో దారి అడ్డగించి కత్తితో నరికి గాయపరిచిన కేసులో నిందితుడికి అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.శైలజ ఏడాది జైలు శిక్షను విధించినట్లు ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. వాకలగరువు గ్రామానికి చెందిన వాకపల్లి వీరబాబుపై పాత కక్షల కారణంగా అదే గ్రామానికి చెందిన గోనెమడలత సూరిబాబు అలియాస్ నాని అక్టోబరు 2020లో కత్తితో తలపై నరికి గాయపరిచాడు. క్షతగాత్రుడు వీరబాబు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ షేక్ జానీబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ట్రయిల్ నిర్వహించి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.శైలజ ముద్దాయి సూరిబాబుకు ఏడాది జైలు శిక్ష విధించారన్నారు. అడిషనల్ పీపీ కె.వెంకటలక్ష్మి బలమైన ఆధారాలను కోర్టుకు అందించారన్నారు.

ముగిసిన సువార్త సభలు

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక శివారు కొత్తకాలువ గట్టు ఏరియాలోని కల్వరి ప్రార్థన మందిరంలో గత మూడు రోజులుగా నిర్వహించిన సువార్త సభలు శుక్రవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబూరావు మాట్లాడుతూ క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సేవల గురించి వివరించారు.

సూర్యారావు మృతి తీరని లోటు



వేగి సూర్యారావు (ఫైల్)



వేగి సూర్యారావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ వేగి సూర్యారావు మృతి తీరని లోటని ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం సూర్యారావు మృతి చెందిన సమాచారం తెలుసుకుని హుటాహుటిన సూర్యారావు స్వగృహానికి తరలివచ్చి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మండలంలో చేసిన సేవలను గుర్తుచేశారు. అలాగే ఆయన కుమారుడు వేగి చంద్రశేఖర్‌ను పరామర్శించి ఓదర్చారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆఖరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తాం



ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో ముక్కంటి

ఆత్రేయపురం: రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆఖరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని ఆర్డీవో ఎం. ముక్కంటి రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని వసంతవాడ, పేరవరం, నార్కెడ్‌మిల్లి, ర్యాలి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎంపీడీవో నాతిబుజ్జిని నేరుగా సంప్రదించవచ్చన్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ, మండల స్థాయి అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అపోహలకు పోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఓ పట్టాభిరామయ్య, ఆర్ఐ భవాని, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు



మాచవరంలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మండలంలో ఉన్న శ్మశాన వాటికలను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల ద్వారా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో శ్మశాన వాటికలకు మెరక పనులు చేస్తున్నామన్నారు. అలాగే కౌశిక గట్లు పటిష్టానికి మట్టితో నింపుతున్నామన్నారు. ప్రభుత్వం సూచించిన కొలతల మేరకు ఉపాధి పనులు చేపట్టాలన్నారు. అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మస్టర్లను పరిశీలించి, పని వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.

కౌలు రైతులకు రుణ సదుపాయం కల్పిస్తాం

పి.గన్నవరం: భూమి లేని కౌలు రైతులకు రుణ సదుపాయం కల్పించే దిశగా ఊడిమూడి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఐదేళ్లుగా గ్రామంలో నివసిస్తూ కౌలు చేస్తున్న భూమి లేని రైతులను గుర్తిస్తున్నామని, వారికి బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని తహసీల్దార్ జీఆర్ ఠాగూర్ పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కౌలు రైతుకు తొలకరిలో మొదటి రుణ సదుపాయంగా 25 శాతం, మిగిలిన 75 శాతం వరి ఊడ్పులు పూర్తైన తర్వాత అందజేస్తారన్నారు.

ప్రభుత్వ భవనాలను త్వరితగతిన నిర్మించాలి

ఆలమూరు: గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కె.జాన్ లింకన్ కోరారు. మండలంలోని చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, కార్యదర్శి యు.రేణుకతో కలసి శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామ సచివాలయం-1 భవన నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నిధులు మంజూరైనందున త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణాల ప్రగతిపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.